RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...





దేవర విడుదలలో మళ్లీ అనుమానాలు


WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

KKR NEWS

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103



ప్రచురణ : హైదరాబాద్, బుధవారం 31-1 -2024 | సంపుటి :01 | ఎడిటర్ : బిర్రు కరుణాకర్ | సంచిక : 130 | పేజీలు : 4 | వెల : 5-00


## షర్మిలకు సెక్యూరిటీ పెంచాలి

- ఆమెకు ప్రాణహాని ఉందన్న అనుమానాలు మాజీమంత్రి

-అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు




వివరాలు 2లో


## నితీశ్ అవసరం మాకు లేదు

- భాజాపాకు భయపడి పోయిన వ్యక్తి

మండిపడ్డ కాంగ్రెస్ నేత రాహుల్




మిగతా 2లో


## హెటిరో పార్థసారథికి విలువైన భూములు

- గతప్రభుత్వ కేటాయింపులను రద్దు చేసిన ప్రభుత్వం
- జీవో 140ని రద్దు చేస్తూ ఆదేశాలు
- గత హైకోర్టు సూచనల మేరకు నిర్ణయం


వివరాలు 2లో




# స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు

- కాంగ్రెస్ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటు
- ఉద్యోగ నియామకాలను పక్కదారి పట్టించే చర్య
- మా హయాంలోనే ఆస్పత్రులను ఏర్పాటు చేశాం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్,జనవరి30
**జర్నలిస్ట్ వార్త**

స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందించే కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమం 'వంట అయినంక గరిటె తిప్పినట్లు' ఉందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. ఉద్యోగ భర్తీ పక్రియను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేస్తే.. తమ ప్రభుత్వ ఘనతగా నియామక పత్రాల జారీ పేరుతో కాంగ్రెస్ సర్కారు హడావుడి చేస్తుండడం దౌర్భాగ్యమన్నారు. ఫిబ్రవరి ఒకటిన గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రచారం చేసిందని.. దాని నుంచి విద్యార్థుల దృష్టి మరల్చేందుకు ముందు రోజున స్టాఫ్ నర్సులకు నియామక పత్రాల జారీ కార్యక్రమాన్ని హంగు ఆర్భాటంతో నిర్వహిస్తుందన్నారు. చేయని పనులకు డబ్బా కొట్టుకోవడం బదులు.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలుపై శ్రద్ధ చూపాలని హరీశ్‌రావు హితవు పలికారు. తెలంగాణ వైద్యారోగ్య రంగాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి చేర్చే లక్ష్యంలో భాగంగా పెద్ద సంఖ్యలో ఆసుపత్రుల నిర్మాణంతో పాటు జిల్లాకో


- మిగతా 2లో పేజిలో





## వేసవి నీటి ఎద్దడి రాకుండా

# ముందస్తు చర్యలు

- ప్రతి గ్రామానికి మంచినీరు అందించేలా ప్రతిపాదనలు
- తాగునీటికి కొత్తగా ఏర్పాటుచేసిన రిజర్వాయర్ల వినియోగం
- తాగునీటి నిర్వహణా బాధ్యతలు సర్పంచ్‌లకు అప్పగింత
- జల్‌జీవన్ మిషన్ నిధులు వచ్చేలా చర్యలు
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సిఎం రేవంత్



**హైదరాబాద్,జనవరి30 జర్నలిస్ట్ వార్త**

రాష్ట్రంలో వచ్చే వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. కేవలం గోదావరి, కృష్ణా నదుల నుంచే రాష్ట్రమంతటికీ నీళ్లు ఇవ్వటం కాకుండా, కొత్తగా ఏర్పడ్డ రిజర్వాయర్లను తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు అనుగుణంగా కొత్త ప్రతిపాద నలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేయటం సులభమవుతుందని, తక్కువ ఖర్చుతో సాధ్యమవుతుందని అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయక్ సాగర్ లాంటి


మిగతా 2లో


## ఇక నేరుగా ప్రజల్లోకి వెళతా

2న ఇంద్రవెల్లి సభతో ప్రారంభిస్తా

పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు సాధించడమే లక్ష్యం

సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి




### బిఆర్ఎస్ హయాంలోనే

# రాడార్ సెంటర్ ఏర్పాటు

కాంగ్రెస్ ప్రభుత్వానికి దీనితో సంబంధం లేదు

కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు

మండిపడ్డ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్,జనవరి30జర్నలిస్ట్ వార్త**

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే దేశ రక్షణలో భాగంగా వికారాబాద్ రాడార్ సెంటర్ నిర్మాణం జరిగిందని తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్పష్టంచేశారు. దేశంలో రెండో కేంద్రంగా వికారాబాద్ ఉందన్నారు. రాడార్ సెంటర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కొందరు కావాలని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు





## జాతిపితకు సిఎం ఘన నివాళి

హైదరాబాద్,జనవరి30: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతి ఆయనకు ఘననివాళి అర్పించింది. మంగళవారం లంగర్‌హౌజ్ బాపూఘాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి తదితరులు గాంధీఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు. మహాత్ముడి సేవలను స్మరించుకున్నారు. పలువురు ప్రముఖులు జాతిపితకు నివాళి అర్పించారు.ఇదిలావుంటే సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎస్ శాంతికుమారి, హోం సెక్రటరీ జితేందర్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్ అంజన్ కుమార్‌లు ఉన్నారు.

# వేసవి నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)



కొత్తగా ఏర్పడ్డ రిజర్వాయర్లన్నింటినీ తాగునీటికి వాడుకోవాలని అన్నారు. మంచినీటి సరఫరా నిర్వహణా బాధ్యతలను సర్పంచ్‌లకు అప్పగించాలన్నారు. దీంతో వారు కూడా బాధ్యతగా పనిచేస్తారని అన్నారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి విభాగాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులను సర్పంచులకు అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇంటింటికీ నీళ్లను అందించే బాధ్యతను వాళ్లకే ఇవ్వాలని అన్నారు. అందుకు అవసరమైన విధి విధానాలు రూపొందించాలని సూచించారు. గ్రామాల వరకు రక్షిత మంచి నీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగమే తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ, నల్లాలు, పైపులైన్ల మెయింటెనెన్స్ మాత్రమే విడిగా సర్పంచులకే అప్పగించాలని చెప్పారు. ఇప్పటివరకు మిషన్ భగీరథలో చేపట్టిన ఇంట్రా విలేజ్ వర్క్స్, ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా చేసే నిర్వహణ ఎవరూ పట్టించుకోవటం లేదని ముఖ్యమంత్రి అన్నారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ అంశం ఎవరి పరిధిలో లేదని అధికారులు వివరణ ఇచ్చారు. జవాబుదారీతనం లేకపోతే గ్రామాల్లో తాగునీటి సమస్య పెరిగిపోతుందని సీఎం అన్నారు. వందకు వంద శాతం తెలంగాణలో ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చినట్లు గత ప్రభుత్వం చెప్పుకోవటంతో నష్టమే తప్ప లాభం లేకుండా పోయిందని ముఖ్యమంత్రి అన్నారు. దీంతో కేంద్రం నుంచి తెచ్చుకునేందుకు వీలున్న జల జీవన్ మిషన్ నిధులు రాకుండా పోయాయని అన్నారు. అందుకే వాస్తవాలను దాచిపెట్టి గొప్పలకు పోవాల్సిన అవసరం లేదని అధికారులను అప్రమత్తం చేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో చాలాచోట్ల తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తండాలు, గూడెలు, అటవీ గ్రామాలకు నీళ్లు అందటం లేదని అన్నారు. ఎన్నికల ప్పుడు తాను ఖానాపూర్‌కు వెళితే తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు చాలా గ్రామాల ప్రజలు తన దృష్టికి తెచ్చిన విషయం గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాలకు, ఎన్ని హాబిటేషన్లకు తాగునీరు అందటం లేదో సమగ్రంగా సర్వే చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నెలాఖరు తో సర్పంచుల పదవీకాలం ముగిసి పోతుందని, అధికారులే తాగునీటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని చెప్పారు. సంబంధిత ఇంజనీర్లు అన్ని గ్రామాలకు వెళ్లి నిజ నిర్ధారణ బృందం చేసినట్లుగానే పక్కాగా తాగునీరు అందని హాబిటేషన్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. జలజీవన్ మిషన్ నిధులు రాబట్టుకునేలా కొత్త ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి పంపించాలని అన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ డెవెలప్మెంట్ ఫండ్ కింద కేటాయించిన రూ.10 కోట్లలో ఒక కోటి రూపాయలను తాగునీటి అవసరాలకు ఖర్చు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో లభ్యమయ్యే నీటిని ప్రజల తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యంగా అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, వాళ్లకు ఆర్థికంగా చేయూతను అందించే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థిని విద్యార్థులు, పోలీసులకు అందించే యూనిఫామ్లు కుట్టించే పనిని ఈ సంఘాల మహిళలకు అప్పగించాలని సూచించారు.

అవసరమైతే తగిన శిక్షణను ఇచ్చి వారిని ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికీ రోడ్డు కనెక్టివిటీ లేని గ్రామాలు, హాబిటేషన్లకు రోడ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 422 గ్రామ పంచాయతీలు, 3177 ఆవాసాలకు ఇప్పటికీ రోడ్డు కనెక్టివిటీ లేదని అధికారులు సీఎం నివేదించారు. వీటన్నింటికీ తారు రోడ్లు వేయాలని సీఎం ఆదేశించారు.

అవసరమైతే ఉపాధి హామీ నిధులను లింక్ చేసి వీటిని పూర్తి చేయాలని చెప్పారు. ఈ బ్జడెట్లోనే అందుకు అవసరమైన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సీఎంతో పాటు ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సాక్షి మీడియా తనది కాదంటే ఎలా?

**జగన్ తీరుపై మండిపడ్డ టిడిపి నేత ఆనం**

నెల్లూరు,జనవరి30 సాక్షి మీడియా తనది కాదంటూ సీఎం జగన్నాటకాలు ఆడుతున్నారని తెదేపా అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి ఆరోపించారు. అసలు సాక్షి సంగతే తనకు తెలియదన్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. నెల్లూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ లక్కీ నంబర్ లక్ష అని చెప్పిన ఆనం.

. రూ. లక్షతో ఆయన పెట్టిన కంపెనీలన్నీ వేల కోట్లకు చేరుకున్నాయని ఆరోపించారు. జగతి పబ్లికేషన్స్ కూడా రూ. లక్ష పెట్టుబడితో పెట్టిందేనని తెలిపారు. ఇందులో రూ. 35వేలు విజయసాయిరెడ్డి, జె. జగన్‌మోహన్‌రెడ్డి రూ.30 వేలు, కామత్ అనే మరో వ్యక్తి రూ.35 వేలు పెట్టుబడి పెట్టారని చెప్పారు. తొలుత విజయసాయిరెడ్డి సాక్షిలో డైరెక్టర్‌గా ఉన్నారని ఆనం తెలిపారు. ఆయన రాజీనామా చేయగానే జగన్ డైరెక్టర్ అయ్యారని.. ప్రస్తుతం ఆయన సతీమణి భారతీరెడ్డి కొనసాగుతున్నారని చెప్పారు.

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఆ సంస్థకు డైరెక్టర్‌గా పని చేశారన్నారు. వీళ్లంతా డైరెక్టర్లుగా ఉంటే జగన్‌కు సంబంధం లేదని అంటే ఎలా అని ప్రశ్నించారు. 'లక్ష రూపాయల కంపెనీలు రూ. వేల కోట్లుగా మారాయి. వైఎస్ కుటుంబం మొత్తానికి సాక్షిలో వాటాలు ఉన్నాయి. తనకేమీ సంబంధం లేనట్లు జగన్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారు' అని ఆనం మండిపడ్డారు.

## బిఆర్ఎస్ హయాంలోనే రాడార్ సెంటర్ ఏర్పాటు

(మొదటి పేజీ (తరువాయి)

నష్టం జరిగే ప్రాజెక్టు కాదు కాబట్టే పరిశీలన చేసి తుది జీవో విడుదల చేశామని కొండా సురేఖ తేల్చిచెప్పారు. జంతువులు, మనుషుల ప్రాణాలకు ముప్పు లేదని స్పష్టంచేశారు. ఇలాంటి కేంద్రాలు తమిళ నాడులో ఉన్నాయని,

ఎలాంటి ప్రమాదం జరగలేదని స్పష్టంచేశారు. వికారాబాద్‌లో రాడార్ సెంటర్ నిర్మాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని గుర్తుచేశారు. రాడార్ సెంటర్ కోసం 2010లో ఒప్పందాలు జరిగాయని కొండా సురేఖ వివరించారు. 2014లో భూముల బదలాయింపు, స్టేజ్ వన్ ఒప్పందాలు జరిగాయని పేర్కొన్నారు. 2017లో ధరల పెంపు, స్థలం మార్పు జరిగాయని వివరించారు. ఆ సమయంలోనే రూ.102 కోట్ల నిధులు విడుదల చేశారని వివరించారు. 2017 నవంబర్ 14న స్టేజ్-2 ఒప్పందాలు జరిగిందని, ఆ ఏడాదిలో జీవోను అప్పటి ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. రాడార్ ప్రాజెక్టు వల్ల ప్రకృతికి నష్టం జరగదని, గ్రామాలు ఖాళీ చేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పాఠశాలలు, కొత్త ప్రాజెక్టులు వస్తాయని వివరించారు. పరిరక్షణ కమిటీ, గ్రామాల నుంచి ప్రజలను తమిళనాడు పర్యటనకు తీసుకెళ్తామని స్పష్టంచేశారు. రెండు, మూడు నెలల్లో రాడార్ సెంటర్‌కు శంకుస్థాపన జరుగుతుందని వివరించారు. నాలుగు ఏళ్లలో నిర్మాణం పూర్తి అవుతుందని వెల్లడించారు.

## నితీశ్ అవసరం మాకు లేదు



న్యూఢిల్లీ,జనవరి30 విపక్ష 'ఇండియా' కూటమిని వీడి, భాజపాతో చేతులు కలిపిన జేడీయూ అధినేత, బిహార్ సీఎం నీతీశ్ కుమార్ అవసరం మాకు లేదంటూ..కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. 'మాకు నీతీశ్ కుమార్ అవసరం లేదు. ఆయనపై ఒత్తిడి రావడంతో యూటర్న్ తీసుకున్నారు' అని భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మొదటిసారి స్పందించారు. 'నీతీశ్ ఎందుకు విపక్ష కూటమిని వీడారో తెలుసు. బిహార్‌లో కులగణన చేపట్టాలని మేం ఆయనకు స్పష్టంగా చెప్పాం. దీనిపై కాంగ్రెస్, ఆర్జేడీ ఒత్తిడి తీసుకువచ్చింది. అందుకు భాజపా భయపడింది. ఆ పార్టీ దీనికి వ్యతిరేకం. నీతీశ్ ఇరుక్కుపోయారు. పారిపోవడానికి భాజపా ఆయనకు దారి చూపించింది. సామాజిక బాధ్యత అందించడం కూటమి బాధ్యత. దానికి నీతీశ్ అవసరం లేదు. కొంచెం ఒత్తిడి వచ్చినా ఆయన యూటర్న్ తీసుకుంటారు' అని విమర్శిం చారు. 2020 శాసనసభ ఎన్నికల తర్వాత నీతీశ్ మూడోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. మహాకూటమి, విపక్ష కూటమిలో కొన్ని విషయాలు నచ్చకపోవడం వల్లే భాజపాతో పొత్తు పెట్టుకున్నట్లు చెప్పారు. మిత్రపక్షాలను మార్చడం ద్వారా బిహార్‌లో సుదీర్ఘకాలంగా అధికారంలో కొనసాగుతున్న నీతీశ్.. భాజపాకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో 'ఇండియా' కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. అయితే, 'ఇండియా' కూటమి కన్వీనర్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికైనప్పటినుంచి ఆయన అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే కూటమిని వీడినట్లు తెలుస్తోంది.

## ఏటీసీ' క్లియరెన్స్ రాకుండానే టేకాఫ్..? పైలట్లపై చర్యలు

దిల్లీ: ఏదైనా ఒక విమానం.. విమానాశ్రయం నుంచి టేకాఫ్ తీసుకోవాలంటే ముందుగా అక్కడి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ నుంచి అనుమతులు తప్పనిసరి. కానీ, ఇటీవల ఇండిగో కు చెందిన ఓ విమానం ఏటీసీ క్లియరెన్స్ లేకుండానే టేకాఫ్ తీసుకున్నట్లు సమాచారం.దిల్లీ విమానాశ్రయం లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇండిగో విమానం (6%జు% 1803) ఈనెల 28న సాయంత్రం దిల్లీ నుంచి అజర్‌బైజాన్ రాజధాని బాకుకు బయల్దేరింది.

# స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు

(మొదటి పేజీ (తరువాయి)

మెడికల్ కాలేజీ బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

ఈ క్రమంలో వైద్య సిబ్బంది కొరత లేకుండా ఉండేందుకు మెడికల్, నర్సింగ్, పారామెడికల్, ఫార్మాసిస్టు, ఇతర సిబ్బంది రిక్రూట్మెంట్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 5,204 స్టాఫ్ నర్స్‌పోస్టులకు 2022 డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదల చేయగా.. 2023 జూన్ 22న 1,890 పోస్టులను కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 7,094కు పెరిగిందని తెలిపారు. 2023 ఆగస్టు 2న ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించి, తుది ఫలితాలు విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ మొదలైందన్నారు. దాంతో తుది ఫలితాల విడుదలకు తాత్కాలిక ఆటంకం కలిగిందని గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహిస్తూ, నియామక పత్రాలు ఇచ్చే పేరిట హడావుడి చేస్తూ స్టాఫ్ నర్సు నోటిఫికేషన్ తమ ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది 2లక్షల పోస్టులను భర్తీ చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మొదటి కేబినెట్ సమావేశంలోనే ఆమోదించి, అభ్యర్థులకు ఎలాంటి అప్లికేషన్ ఫీజు లేకుండా, ఏడాదిలోపే అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని, అలాగే గతంలో ప్రారంభించిన నియామకాల పక్రియను వాటి షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ పేరిట పత్రికల్లో ప్రకటనలు విడుదల చేసిందని గుర్తు చేశారు. చెప్పినట్లుగా ఫిబ్రవరి ఒకటో తేదీన గ్రూప్-1 నోటిఫికేషన్, అలాగే ఏప్రిల్ 1న గ్రూప్-2, జూన్ 1న గ్రూప్-3,4 నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 1న పోలీసు సహా తరహా యూనిఫాం పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల మన్ననలు పొందేలా అత్యుత్తమ సేవలందించి, ఉద్యోగంలో రాణించాలని ఆకాంక్షించారు. మొత్తం 7,094 స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేసే పక్రియను విజయవంతంగా పూర్తి చేసిన తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు (ఓఊ-ూఖీః)ని అభినందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సుల సేవలను గుర్తించి, వారి గౌరవాన్ని మరింత పెంచేలా వృత్తి పేరును ఉన్నతీకరించిందని హరీశ్‌రావు అన్నారు.

# షర్మిలకు సెక్యూరిటీ పెంచాలి

విశాఖపట్నం,జనవరి30(ఆర్ఎన్ఎ): వైఎస్ షర్మిలకు సెక్యూరిటీ పెంచాలని, ఆమెకు కూడా ప్రాణహాని ఉందన్న అనుమానాన్ని మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఏదో ఒక అంశాన్ని ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి జగన్‌పై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. జగన్‌కు వ్యతిరేకంగా షర్మిల మాట్లాడటం ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేత అయ్యన్న పాత్రుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ చాలా చాలా దుర్మార్గుడు. జగన్‌కు తల్లి, చెల్లి, బాబాయ్ అందరూ ఒక్కటే. అధికారం కోసం ఏమైనా చేస్తాడు. జగన్‌కు వ్యతిరేకంగా షర్మిల గట్టిగా మాట్లాడుతున్నారు. బాబాయిని చంపినట్లు షర్మిలను చంపుతారని నాకు అనుమానం ఉందని అంటూ అయ్యన్న పాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. షర్మిలకు వెంటనే సెక్యూరిటీని పెంచాలన్నారు. సొంత బాబాయిని చంపేశారని, అందుకే తమకు జగన్ మీద అనుమానం ఉందన్నారు. విశాఖపట్నంలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అయ్యన్న మాట్లాడారు. జగన్‌కు తల్లి, చెల్లి, బాబాయ్ అనే తేడా లేదు.. నేనో లెక్కా. షర్మిలను అంతమొందించినా ఆశ్చర్య పడక్కర్లేదు. ఆమెకు భద్రత పెంచాలి. రాజశేఖర్‌రెడ్డి ఆస్తిలో షర్మిలకు వాటా రాశారు. అది జగన్ ఇవ్వడం లేదన్నారు. ఇదిలావుంటే తనకూ ప్రాణహాని ఉందని అయ్యన్న అన్నారు. రివాల్వర్ లైసెన్స్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేశా. గన్‌మెన్‌ను ఇస్తానని ఎస్పీ అంటే నేనే వద్దనేశా. ఎక్కడ ఉన్నానో గన్‌మెన్‌లే సమాచారం ఇస్తారని వద్దని చెప్పా. అనకాపల్లి ఎంపీ స్థానానికి నా కుమారుడు దరఖాస్తు చేశారు. ఆ అంశం అధిష్ఠానం పరిశీలిస్తోంది' అని అయ్యన్నపాత్రుడు తెలిపారు. భూములను కబ్జా చేయడమే వైకాపా పనిగా పెట్టుకుందని చింతకాయల అయ్యన్న పాత్రుడు విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఉత్తరాంధ్రకు ఏం చేశారో చెప్పగలరా అని సీఎం జగన్‌ను ప్రశ్నించారు

# హెటిరో పార్థసారథికి విలువైన భూములు

హైదరాబాద్,జనవరి30

హెటిరో అధినేత,బిఆర్ఎస్ ఎంపి పార్థసారథిరెడ్డికి సంబంధించిన సంస్థలకు కేటాయించిన భూములపై తెలంగాణ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ ఎంపీ పార్థసారధి రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. హెటెరో సంస్థల అధిపతిగా ఉన్న ఆయనకు ఆస్పత్రి నిర్మాణానికి అంటూ పదిహేను ఎకరాల అత్యంత ఖరీదైన భూమిని 30 ఏళ్ల లీజుకు గత ప్రభుత్వం కేటాయించింది. ఈ లీజు ఒప్పందాన్ని రద్దు చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానమేట్‌లో సాయిసింధూ ఫౌండేషన్‌కు 15 ఎకరాలు కేటాయింపు చేస్తూ విడుదల చేసిన జీవో 140ను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. సాయి సింధు ఫౌండేషన్, క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల కోసం హాస్పిటల్ నిర్మాణం, లాభాపేక్ష లేకుండా 30 సంవత్సరాల కాలానికి లీజు ప్రాతిపదికన భూమి కేటాయించింది. సర్వే నంబర్ 41/14/2లోని భూమికి ఏడాదికి రూ. 1,47,743 లీజు మొత్తాన్ని సాయిసింధూ ఫౌండేషన్ చెల్లించేలా నిర్ణయించింది. హైటెక్‌సిటీకి కూతవేటు దూరంలో ఉన్న 15 ఎకరాల భూమిని గత సర్కారు తమ ఎంపీకి కారు చౌకగా కట్టబెట్టింది. రూ.4 వేల కోట్ల విలువైన భూమిని.. ఏడాదికి ఎకరానికి రూ.2 లక్షల చొప్పున.. మొత్తం రూ.30 లక్షలు చెల్లించేలా లీజుకు ఇచ్చింది. అంతేకాదు.. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి ట్రస్టీగా ఉన్న సాయిసింధు ఫౌండేషన్‌కు ఎన్నికలకు ముందు గోప్యంగా జారీ చేసిన జీవో ద్వారా ఈ భూమిని ధారాదత్తం చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి.

నిజానికి ఇది రెండో సారి ఈ భూమి కేటాయించడం . అంతకు ముందు ఓ సారి కేటాయిస్తే హైకోర్టు రద్దు చేసింది. తెలంగాణ ప్రభుత్వం 2018లో 15 ఎకరాలు కేటాయించింది. క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం కోసం ఖానామెట్ లో భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేసింది. అయితే, సాయి సింధు ఫౌండేషన్ కి భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోని సవాల్ చేస్తూ రైట్ టు సొసైటీ సభ్యులు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అయితే, ప్రభుత్వం నిర్ణయంపై కొంతమంది హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు జీవోను కొట్టివేసింది. భూకేటాయింపుల్లో ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా ఉండేలా పున:పరిశీలన చేయాలంటూ ప్రభుత్వానికి సూచించింది. అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఇంత తక్కువకు అద్దెకు ఇవ్వడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ లెక్కన రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.5వేల 344 కోట్ల గండి పడుతుందని తెలిపింది. ఇంత ఖరీదైన భూమిని ఏకపక్షంగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం అనేక అనుమానాలకు తావిస్తోందని హైకోర్టు సీరియస్ అయ్యింది. హైకోర్టు రద్దు చేయడంతో.. ఎన్నికలకు ముందు మరోసారి సీక్రెట్ గా భూమిని కేటాయించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కోర్టు తీర్పును ఏమాత్రం పట్టించుకోలేదు.

పార్థసారథిరెడ్డి ట్రస్టుకు లీజును కట్టబెట్టేందుకే మొగ్గుచూపింది. మరోమారు లీజు నిబంధనలను సవరించింది. 2023 సెప్టెంబరు 25న జీవో-140 ద్వారా సాయిసింధు ఫౌండేషన్‌కు విలువైన భూమిని కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఏడాదికి రూ.50 కోట్ల మేర లీజు చెల్లించాలని, ప్రతి ఐదేళ్లకోసారి లీజుమొత్తాన్ని 10శాతం మేర పెంచాలని సర్కారు జారీ చేసిన నిబంధనలు చెబుతున్నా.. 'విచక్షణ అధికారం' పేరుతో బీఆర్ఎస్ సర్కారు ఏడాదికి ఎకరాకు రూ.2 లక్షల చొప్పున.. 15.4 ఎకరాలకు రూ.30 లక్షలు చెల్లించేలా లీజుకు ఇస్తున్నట్లు జీవో-140లో స్పష్టం చేసింది. ఇప్పుడీ భూమి కేటాయింపును రేవంత్ సర్కార్ రద్దు చేసింది.

## ఇక నేరుగా ప్రజల్లోకి వెళతా

హైదరాబాద్,జనవరి30 ప్రజల్లోకి వెళ్లేందుకు 2వ తేదీ నుంచి సభలు నిర్వహిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 2వ తేదీన ఇంద్రవెల్లిలో సభ ఉందని... నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు ఇంకా 60 రోజులలో జరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ... ఇప్పటికే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ వచ్చిందని.. తెలంగాణలో కూడా రాజ్యసభ ఎన్నికల జరుగుతున్నాయని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు. పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా సభలు నిర్వహించి ముందుకు పోవాలని కోరారు. అభ్యర్థుల ఎంపిక పూర్తిగా అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. హైకమాండ్ తెలంగాణకు పరిశీలకులను నియమించిందని వివరించారు. హరీష్ చౌదరీ చైర్మన్‌గా కమిటీ పనులు చేస్తుందని స్పష్టం చేశారు. ఆ కమిటీ అభ్యర్థుల ఎంపిక చూసుకుంటుందని చెప్పారు. మనం కష్టపడి కాంగ్రెస్ విజయం సాధించే విధంగా కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## మెదక్‌లో విషాదం..

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు




మెదక్: స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. అనుశ్రీ (6) తల్లిదండ్రులు బిక్షపతి, నవీన బొంతపల్లిలో ఉంటారు.

హౌసింగ్‌బోర్డులో నివాసముంటున్న పిన్ని, బాబాయి వద్ద ఉంటూ బాలిక.. స్థానిక మాస్టర్ మైండ్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతోంది. రోజు మాదిరిగానే స్కూల్ కు వెళ్లిన చిన్నారి సాయంత్రం ఇంటి వద్ద దిగి బస్సు ముందు నుంచి వెళ్తున్న క్రమంలో డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో టైరు కిందపడి మృతి చెందింది. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్, క్లీనర్ అక్కడి నుంచి పరారయ్యారు.

ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన చిన్నారిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహించిన స్థానికులు బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి




వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఎస్ఎఫ్ఐ వర్ధన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చుక్క ప్రశాంత్ హాజరైనారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో సభ్యత్వాలు నమోదు చేపట్టారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత పాలకులు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామని చేయలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల అవసరాల దృశ్య మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలన్నారు. కళాశాలలో నూతన భవనం నిర్మించి, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల కార్యదర్శి ఇస్లావత్ కళ్యాణ్, అధ్యక్షులు ఎండి సమీర్, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, రామ్ చరణ్, రాజు, మోక్షిత్, అనూష, పల్లవి, రుచిత తదితరులు ఉన్నారు.

# రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

### – వర్ధన్నపేట తహశీల్దార్ విజయ్ సాగర్



వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని చేపట్టారు. ఉప సర్పంచ్ తాల్లపెల్లి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన తహశీల్దార్ విజయ్ సాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా పౌర హక్కుల దినోత్సవం ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమైన చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల వారిగా ప్రతీ ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటర్ కమిటీ సభ్యులు బిర్రు మహేందర్ మాదిగ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దళిత, గిరిజనులకు మహోత్తరమైన అవకాశాలు కల్పించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, దళిత, గిరిజన కాలనీ వాసులను చైతన్యం చేయడమే పౌరహకుల దినోత్సవ కార్యక్రమ ఉద్వేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణస్వామి, గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్వేష్, గ్రామస్థులు, ఎస్సీ, ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు

### – మౌనం పాటించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్




హనుమకొండ, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారితో పాటు వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, సెంట్రల్ జోన్ డిసిపి ఎం.ఎ. భారీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగరాలే పాల్గొని గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళులు అర్పిస్తూ, 2 నిమిషాల పాటు అధికారులు, ఉద్యోగులు మౌనం పాటించారు. అనంతరం డిఆర్వో వై.వి. గణేష్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన యోధులు అన్నారు. స్వతంత్ర భారతదేశ ప్రజానీకానికి గాంధీజీ అనుసరించిన అహింస మార్గాన్ని ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు కిరణ్ కుమార్, భోజరాజు, కిషోర్ కుమార్, ఇతరత్రా అధికారులు పాల్గొన్నారు.

# బుగులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘనపూర్, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారంచిల్పూరు బుగులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం స్వామివారి శేష వస్త్రాలతో వారిని సత్కరించి, వేదపండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట స్థానిక ఎంపీపీ, సర్పంచులు, ఎంపిటిసిలు, సొసైటీ చైర్మన్లు, రైతు బంధు సమితి కో ఆర్డినెటర్లు, కార్యకర్తలు, అధికారులు తదితరులు ఉన్నారు.

# నేటితో సర్పంచుల పదవి కాలం ముగిసింది

### - గ్రామ పంచాయితీ సేవలు అధికారుల చేతిలోకి- వీడ్కోలు సమావేశంలో సర్పంచులకు సన్మానం



వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపిడిఓ రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఎంపీపీ అప్పారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, ఎమ్మార్వో విజయ్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటితో సర్పంచులు పదవి కాలం ముగుస్తుందని వివరించారు. నేటి నుంచి గ్రామపంచాయతీ సేవలు ప్రభుత్వం కేటాయించిన అధికారుల చేతిలోకి చేరుతున్నట్లు చెప్పారు. ఐదు సంవత్సరాల కాలం పాటు గ్రామాల అభివృద్ధి కొరకు సర్పంచులు కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వ ఆదేశానుసారం అభివృద్ధి పనులను దాదాపు పూర్తిస్థాయిలో నిర్వహించి సర్పంచులు కొంత అసంతృప్తితోనే ఉన్నట్లు మాట్లాడారు. వ్యక్తిగత స్వలాభం కోసం చూడకుండా గ్రామాల వారిగా అభివృద్దే లక్ష్యంగా పనిచేసిన వారిని అభినందిస్తూ మండల పరిధిలోని 18 గ్రామాల పంచాయతీ సర్పంచులను సన్మానించారు. ఈ సమావేశంలో భాగంగా పదవీ విరమణ పొందుతున్న సర్పంచులు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో గెలుపొందిన సమయం నుంచి నేటి వరకు ప్రజా సేవలో తరించిన తృప్తి వారికి ఉంటుందన్నారు. పదవిలో ఉన్నంతకాలం ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజా పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాల్లో తనదైన శైలిలో పాత్రను పోషించి గ్రామాల వారిగా ప్రజల మన్ననలు పొందామని చెప్పుకొచ్చారు. వివిధ గ్రామాల వారీగా ఆయా సర్పంచులకు గ్రామస్తుల ద్వారా వచ్చే ఫిర్యాదులు, చేస్తున్న విమర్శల పట్ల వారికి ఒక తీపి అనుభవం మిగిలిందని గుర్తు చేశారు. ఇంతకాలంగా గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్యాచరణలో భాగంగా వారితోపాటు సహాయ సహకారాలు అందించిన స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ సభ్యులు పాష, కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీకి నివాళులు అర్పించిన వరంగల్ సిపీ



వరంగల్, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కార్యాలయములో విధులు విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది గాంధీజీ చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రాగ్యానాయక్, సంజీవ్, సురేష్ కుమార్, ఏసీపీలు, ఆర్ఐలు, ఇన్స్పెక్టర్లు ఉన్నారు.

## టీఎస్?పీఎస్సీ యాక్టివ్ ..

### వారం రోజుల్లో గ్రూప్ 4 ఫలితాలు

హైదరాబాద్, వెలుగు: టీఎస్?పీఎస్సీ యాక్టివ్ అయింది. ఆగిన పనుల్లో కదలిక మొదలైంది. ఇప్పటికే పూర్తయిన రాత పరీక్షల ఫలితాలు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. సర్కారు అనుమతి తీసుకుని నిలిచిపోయిన పలు పరీక్షలనూ నిర్వహించేందుకు రెడీ అవుతోంది. ఈ క్రమంలోనే వారం రోజుల్లోనే గ్రూప్ 4 ఫలితాలు ఇచ్చేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. త్వరలోనే కమిషన్ తొలి భేటీ కొత్త గవర్నమెంట్ ఏర్పడ్డాక గత నెలలో టీఎస్?పీఎస్సీ చైర్మన్? జనార్దన్ రెడ్డి సహా సభ్యులు రాజీనామా చేశారు. వాటిని గవర్నర్ తమిళిసై ఆమోదించిన రెండ్రోజుల్లోనే కొత్త కమిషన్?కు సర్కారు నోటిఫికేషన్ ఇచ్చింది. ఆపై రెండు వారాల్లోనే అప్లికేషన్లు స్వీకరించి, చైర్మన్? సహా ఐదుగురు సభ్యులను నియమించింది. ఈ నెల 26న కొత్త చైర్మన్?గా మహేందర్ రెడ్డి, సభ్యులుగా యాదయ్య, పాల్వాయి రజినీ, అనితా రాజేంద్ర బాధ్యతలు చేపట్టిన నుంచి ప్రతిరోజూ సమీక్షలు, సమావేశాలతో కమిషన్ బిజీగా మారింది

# ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



సంగెం, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: సంగెం మండలం కుంటపల్లి గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందగట్ల కళావతి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండలం ఎంపీపీ కందగట్ల కళావతి అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. హక్కులు ఎలా వినియోగించుకోవాలన్న విషయమై ప్రజలకు సూచన చేశారు. దళితుల భూ సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులను కలిసి పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రతీ దళిత బిడ్డ చదువుకోవాలని కోరారు. చదువుతూనే జ్ఞానం లభించి, సమాజంలో గొప్ప వ్యక్తులుగా గుర్తించబడతారని చెప్పారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కేవలం చదువుతో మాత్రమే సాధ్యమౌతుందని ప్రస్తావించారు. రాజ్యాంగం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన హక్కులు సాధించుకోవాలన్నా చదువుకుని తీరాల్సిందేనని విద్యపట్ల ప్రజలకు అమూల్యమైన సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, డిప్యూటీ తసిల్దార్, స్థానిక సర్పంచ్ కావటి వెంకటయ్య, వాజిత్ హమ్మద్, గ్రామ ప్రజలు, యువకులు, ఎస్సీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్ ఎఫెక్ట్.. మాల్దీవుల ప్రభుత్వానికి మరో షాక్!

మాలే: మాల్దీవుల ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలినట్టు తెలుస్తోంది. మాల్దీవుల మంత్రులు, నేతలు.. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన కారణంగా భారతీయులు..కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. కాగా, మాల్దీవుల పర్యాటకం కోసం వెళ్లే భారతీయులు సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ విషయాన్ని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. వివరాల ప్రకారం.. భారత్‌తో దౌత్యపరమైన వివాదానికి తెరలేపిన మాల్దీవులకు మరోసారి షాక్ తగిలింది. భారత్ నుంచి మాల్దీవులకు వెళ్లే పర్యాటకుల సంఖ్య భారీగా తగ్గింది. మాల్దీవుల పర్యాటక ర్యాంకింగ్‌లో మన దేశ స్థానం గణనీయంగా పడిపోయింది. ఈ విషయాన్ని ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. గతేడాది డిసెంబరు 31 వరకు భారత్ నుంచి 2,09,198 మంది పర్యాటకులు మాల్దీవులను సందర్శించారు. దీంతో, మాల్దీవుల పర్యాటక మార్కెట్‌లో 11 శాతం వాటాతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది.

# సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్

### – స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వరంగల్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు మంగళవారం పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. ఏసిపి యం. భోజరాజు సూచనల మేరకు జీడబ్ల్యు ఎంసి ఆవరణలో వరంగల్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు వాహనాలను అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. నెంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న వాహనాలకు నెంబర్ ప్లేట్లను వేయించారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ సి.ఐ పి. వెంకన్న మాట్లాడుతూ అన్ని రకాల వాహనదారులు తప్పకుండ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. తమ వాహనాలకు సంబందించిన డాక్యుమెంట్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాలపై పరిమితికి మించి ప్రయానించరాదని సూచించారు. తమ వాహనాల నెంబర్ ప్లేట్ ముందు, వెనుకవైపు కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా పోలీసులు తీసుకునే చర్యలకు ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు

### కృషి చేయాలి



సంగెం, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ కోదాటి శ్రీధర్ అన్నారు. మంగళవారం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత 20 సంవత్సరాల నుండి ప్రభుత్వ విద్య బలోపేతానికి సంఘ పరంగా అందిస్తున్న సేవలను కొనియాడారు. ఇదే స్ఫూర్తితో కళాశాలల అభివృద్ధికి తోడ్పడాలని అసోసియేషన్ వారికి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ అసోసియేషన్ కౌన్సిలర్ మామిండ్ల బుచ్చిరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాత్రి నాగరాజు, అనిల్ కుమార్, పవన్ కుమార్, కుమారస్వామి, యాక సాయిలు, కుమారస్వామి, అక్రమ్ అలీ, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## దేశంలో కులగణన రాజకీయాలు !

దేశంలో కుల రాజకీయాలు, వర్గ రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయ నాయకుల ఎజెండా ఓట్లు కొల్లగొట్ట డమే తప్ప మరోటి కాదు. కులాల వారీగా విభజించి ఓట్లు కొల్లగొట్టే ఎత్తులకు ప్రయత్నాలు మొదల య్యాయి. దీనిని అడ్డుకోవాలన్న ధ్యాస మేధావివర్గంలో లేకుండా పోతోంది. బీహార్‌లో మొదలైన కులగణన చిచ్చు..ఇప్పుడు దేశంలో క్యాన్సర్‌లా విస్తరిస్తోంది. నిజానికి ఆర్థిక అసమానతలపై జనాభా గణన జరగాలి. ఏ గ్రామానికి వెళ్లినా ఉన్నవారెవరో..లేని వారెవరో ప్రత్యక్షంగా కనినిస్తుంది. ఇళ్లు ఉన్నవారు లేని వారు కూడా కనినిస్తారు. ఆర్థికంగా బలవంతులు ఎవ్వరో..బలహీనులు ఎవ్వరో కనిపిస్తుంది. అంతెందుకు ఇప్పుడున్న తెల్ల రేషన్ కార్డుదారుల్లో వేలాదిమంది ఆర్థికంగా ఉన్నతవర్గాలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్ పొందేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తెల్ల కార్డులు పొందారు. ఈ రెండు రాష్ట్రాల్లో కార్డుల ఆధారంగా వారి ఆర్థికస్థితిగతులను లెక్క కట్టగలమా అన్నది చెప్పాలి. కులగణన చేపట్టాలని ఇరు తెలుగు రాష్ట్రాల్లో తీసుకున్న నిర్ణయం వల్ల కులాల సంఖ్య తేలవచ్చు.. కానీ ఆర్థికస్థితిగతులు తేలవు. కులాల కుంపట్లు పోవాలని కోరుతున్న వారే ఇప్పుడీ కులగణనకు పూనుకోవడం దారుణం. కారణమేంటంటే కులాల వారీగా ఓట్లు పొందాలన్న రాజకీయ కారణమే వారిని ఇలా చేయిస్తోంది. సామాజిక వెనకబాటుతనం గతంలో లాగా లేదు. కులాల మధ్య అంతరాలను తొలగించాల్సిందే. సమాజంలో అంతా ఒక్కటే అన్న భావన పెంపొందించే చర్యలు కావాలి. కులాల ఆధారంగా ఇది సాధ్యం కాదు. దేశ రాజకీయాల్లో ఇప్పుడు వీస్తున్న గాలి కులగణన, అంటే వెనుకబడిన తరగతుల జనాభా లెక్కలు తేల్చడం, కులాల వారీగా జన గణనను చేపట్టడం మాత్రమే అవుతుంది. అలాంటి వారి ఆర్థిక స్థితిగతులను కూడా చేపడితే..మున్ముందు వెకబడిన వర్గాలకు ఏవైనా పథకాలు అమలు చేయాలన్నప్పుడు ఇలాంటి వారిని గుర్తించడం సులవు కాగలదు. జాతీయ స్థాయిలో దీనిని నిర్వహించడానికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరాకరించింది. ఇది సమాజాంలో అసంతృప్తులకు, విభజనకు కారణం అవుతుందని భావించారు. ఇది ముమ్మాటికీ నిజం. దీంతో సమాజంలో చీలిక వస్తుంది. అంతరాలు ఏర్పడుతాయి. అయితే ఈ వాదాన్ని ఎవ్వరు కూడా పట్టించు కోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో కులగణనకు అంగీకరించింది. ఈ క్రమంలో తెలంగాణలో కులగణనకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పూనుకుంటోంది. గతంలోనే బీహార్ లోని నితీశ్ కుమార్ నాయకత్వంలోని జెడి (యు)–, ఆర్‌జెడిల మహాఘట్ బంధన్ ప్రభుత్వం తొలిసారిగా ఆ రాష్ట్రంలో కులప్రాతిపదిక జనాభాలెక్కల సేకరణను పూర్తి చేసింది. ఆంధ్రప్రదేశ్ కూడా దీనిని చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన ఆవశ్యకతను గుర్తించి తాము అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో దీనిని జరిపిస్తామని ప్రకటించారు. తెలంగాణలో కులగణనను చేపడతామని మొన్న జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచార సమయంలో రాహుల్ గాంధీ వాగ్దానం చేశారు. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తాజాగా నిర్ణయం తీసుకొంది. త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లోనే కుల గణనకు సంబంధించిన బిల్లు ప్రవేశపెడతారని తెలుస్తు న్నది. దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు ప్రత్యేక కమిటీ వేసి బీహార్‌లో జరిగిన పద్ధతిని అధ్యయనం చేయించనున్నారని సమాచారం. రాష్ట్రంలో కులగణన చేపట్టబోతున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాహుల్ గాంధీ అభినందించారు. ఎందుకంటగే ప్రకటించిన హామీ మేరకు ముందుకు సాగుతున్నారు. నిజానికి దీని అవసరం లేదని వారు గుర్తించడం లేదు. సమాజంలో అంతరాలను తొలగించే ప్రయత్నం కానీ, అధ్యయనం కానీ జరగడం లేదు. దేశంలో అత్యధిక జనం ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారు. సగానికి మించిన జన సంఖ్య సరైన తిండి, ఇల్లు, ఇతర మానవీయ జీవన సౌకర్యాలకు దూరంగా బతుకుతున్నారు. ఈ పేదరికం అన్నది కులాన్ని అంటిపెట్టుకొని లేదు.. ఉన్నతవర్గాలుగా చెబుతున్న అనేక కులాల్లో పేదలు లెక్కకు మిక్కిలి ఉన్నారు. బ్రాహ్మణవర్గాల్లో నేటికీ యాచకవృత్తితో బతుకుతున్న వారు లక్షల్లో ఉన్నారు. వీరిని ఉన్నత కులాలుగా పిలుస్తున్నా..వీరికి ఏ పథకం అందడం లేదు. నిజానికి భారతదేశంలో శ్రామికవర్గాలకు చెందిన వారే ఇప్పటికీ దుర్భర దారిద్ర్యంలో ఉన్నారు. ఇందులో అన్ని కులాల వారు ఉన్నారు. తమ బతుకుదెరవు కోసం వీరు నిత్యకూలీలుగా ఉన్నారు. వీరికి సరైన న్యాయం జరగాలంటే కులాలవారీ జనగణన అవసరం లేదు. కుటుంబాల ఆధారంగా ఆర్థిక గణన జరగాలి. కొత్తగా మరికొన్ని కులాల వారికి రిజర్వేషన్లు కల్పించాలన్న ఆలోచనలు కూడా మంచిది కాదు. అమెరికాలో నేటికీ కులాల ఆధారంగా లెక్కలు తీయడం లేదు. ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లిన వారు తమ కులాల గురించి మాట్లాడడం లేదు. బ్రిటిష్ వారు 1931లో సేకరించిన కులాలవారీ లెక్కల తరవాత సమాజంలో మార్పులు వచ్చాయి. అనేక కులాల వారు స్వశక్తితో పైకి వచ్చారు. తమకంటే హోదాను ఏర్పరచుకున్నారు. సమాజంలో ఉన్నతవర్గాలుగా చెలామణి అవుతున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికీ కులాల కుంపట్ల మీదనే ఆధారపడుతున్నాయి. ఏ వర్గానికి, ఏ మేలు చేయాలన్నా కులాల ఆధారంగానే లెక్కలు వేస్తున్నారు. ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవడం లేదు.

# కొత్త జిల్లాల ఏర్పాటుపై కమిషన్

## సిఎం హామీ మేరకు అసెంబ్లీలో చర్చ -కొత్తగా పివి పేరుతో జిల్లా ఏర్పాటు డిమాండ్

హైదరాబాద్,జనవరి30

కొత్త జిల్లాల ఏర్పాటు అసంబద్ధంగా జరిగిందని సిఎం రేవంత్ రెడ్డి అంగీకరించాక..దీనిపై కమిషన్ వేసి అధ్యయనం చేస్తామని ప్రకటించారు. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటులో ఉన్న లోటుపాట్లను తొలగిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో జిల్లాల కుదింపు జరగవచ్చన్న సంకేతాలు వచ్చాయి. పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలు చేశారు.

ఇందులో అధ్యయనం తరవాత శాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటుకు మార్గం సుగమం కావచ్చు. గత బిఆర్ఎస్ హయాంలో కొత్త జిల్లాలను ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేశారు. కొత్తగా కమిషన్ ఏర్పాటు చేసి,

అసెంబ్లీలో చర్చించాక కొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేస్తామని సిఎం రేవంత్ ప్రకటించారు. దీంతో శాస్త్రీయంగా ఏర్పాటుకు అవకాశం రానుంది. ఈ క్రమంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు పేరుతో జిల్లాని ఏర్పాటు చేయాలని డిమాండ్ రోజురోజుకి పెరుగుతుంది. అప్పటి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలో హుజురాబాద్ కేంద్రం గా పీవీ నరసింహారావు జిల్లాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా అందోళన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అయినా ఫలించలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మరోసారి పీవీ జిల్లా తెరపైకి వచ్చింది.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ కేంద్రంగా పీవీ నరసింహారావు జిల్లాని ఏర్పాటు చేయాలని మేధావులతో పాటు ప్రజాసంఘాలు డిమాండ్ చెస్తున్నాయి. మాజీ ప్రధాని పీవీ భీమదేవరపల్లి మండలం వంగరలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం ఇక్కడి నుండే మొదలు అయ్యింది. అయన జ్ఞాపకాల గుర్తుగా హుజురాబాద్ కేంద్రంగా పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలారోజుల నుండి ఉంది. గత బీఅర్ఎస్ ప్రభుత్వం పది జిల్లాల నుండి ముప్పై మూడు జిల్లాలకి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అ సమయంలోనే పీవీ జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ పెరిగింది. ఈక్రమంలోనే పీవీ జిల్లా సాధన సమితిని కూడా జేఏసి నేతలు ఏర్పాటు చేశారు. అప్పట్లో హుజురాబాద్ కేంద్రంగా నెల రోజులపాటు అందోళన కార్యక్రమాలు జరిగాయి.

అప్పటి రాష్ట్ర మంత్రి ఈటెల రాజేందర్ జోక్యం చేసుకుని అందోళన విరమింపజేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. అయితే హుజురాబాద్ జిల్లా కేంద్రం కాకుండా డివిజన్ కేంద్రంగా మారింది. మళ్ళీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో జిల్లాల పునర్విభజనపై చర్చ జరుగుతోంది ఈ క్రమంలో మరోసారి పీవీ జిల్లా తెరపైకి వచ్చింది. నిజానికి ప్రొఫెసర్ జయశంకర్, కుమ్రం భీమ్, యాదాద్రి, వేములవాడ రాజన్న, జోగులాంబల పేరు మీద జిల్లాలు ఏర్పాడ్డాయి. పివి పేరు మా÷–తరం విస్మరించారు. దీంతో హుజురాబాద్ కేంద్రంగా పదిహేను మండలాలని కలుపుతూ పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలని మేధావులతో పాటుగా ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్పడిన తరువాత మొదటిసారిగా హుజురాబాద్‌లో పీవీ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రోఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం హాజరు అయ్యారు. అయన సైతం పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలని సూచించారు. పీవీ జిల్లాపై ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీవీ చేపట్టిన అర్థిక సంస్కరణలు భూ సంస్కరణలు చేపట్టారని ప్రస్తావించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని జిల్లాలని మార్చడం, లేదంటే కుదించడంపై చర్చ సాగుతుంది. పరిపాలన సౌలభ్యంగా ఉండే జిల్లాలని ఏర్పాటు చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రభుత్వం తెలిపింది. పీవీ జిల్లా ఏర్పాటుకు ప్రతిపక్షాలు కూడా మద్దతు ఇవ్వడంతో ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

పీవీ సేవలు గుర్తుండే విధంగా అయన పేరుతో జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జేఏసి నేతలు డిమాండ్ చేస్తున్నారు. అరేళ్ళుగా ఉద్యమాలు చేస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పీవీ జిల్లా కోసం ఎనిమిది ఏళ్ళుగా పోరాటం సాగుతుందని ఎమ్మెల్సీ కోదండరాం అంటున్నారు. అయన పేరు పైనా జిల్లా ఏర్పటుపై సర్వరమే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాల పరిశీలనపై కమిటీ వేసి చర్చించే అవకాశం ఉంది. విధివిధానాలు ఖరారు చేస్తారు. ఆ మేరకు జిల్లాల ఏర్పాటుతో పాటు, రూపురేఖలు మారనున్నాయి. అప్పుడు పివి జిల్లా ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి.

# నేటినుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- ఫిబ్రవరి1న ఆర్థికమంత్రి ఓటాన్ అకౌంట్ బడ్జెట్

న్యూఢిల్లీ,జనవరి30:పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొత్త భవనంలో నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో చివరి బడ్జెట్ సమావేశం మొదలవుతుంది. ఉభయ సభలను ఉద్దేశించి ముర్ము ప్రసంగిస్తారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం నాడు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్ సభలో ప్రవేశ పెడతారు. ఏప్రిల్– మే నెలలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రతిపాదిస్తారు. ఎన్నికల నేపథ్యంలో విధానపర ప్రకటనలు ఏమి ఉండకపోవచ్చు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కు పార్లమెంట్ ఆమోదం తెలిపితే ఏప్రిల్–జులైకి కావాల్సిన నిధులను ప్రో రేటా ప్రాతిపదికన భారత సంఘటిత నిధి నుంచి తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం 2024–25 ఏడాదికి జూన్‌లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెడతారు. ఈ క్రమంలో కొత్త పథకాలు లేదా విధానాలు ప్రకటించే అవకాశం ఉండకపోవచ్చు. ఆర్థికమంత్రిగా వరసగా ఆరోసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమర్పిస్తున్నారు. ఐదు సార్లు పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించారు. ఈ సారి ఓటాన్ అకౌంట్ బ్జడెట్ ప్రతిపాదిస్తారు. వరసగా ఆరోసారి బ్జడెట్ సమర్పించిన మహిళ నేతగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. మాజీ ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ అత్యధికంగా పది సార్లు బ్జడెట్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత స్థానంలో నిర్మలా సీతారామన్ నిలుస్తారు. అరుణ్ జైట్లీ, పి చిదంబరం, యశ్వంత్ సిన్హా, మన్మోహన్ సింగ్ ఐదు సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు.



మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ బ్జడెట్ ప్రవేశపెట్టారు. ఇందిరా తర్వాత బడ్జెట్ ప్రతిపాదించిన మహిళా నేతగా నిర్మలా సీతారామన్ నిలిచారు.

2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. అరుణ్ జైట్లీ కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేశారు. 2014–15, 2015–16, 2016–2017, 2017–2018, 2018–2019 ఐదుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. జైట్లీ అనారోగ్యానికి గురికావడంతో 2019–2020 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం పీయూష్ గోయల్‌కు వచ్చింది. 2019లో మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చింది. జైట్లీ సూచనలతో నిర్మలా సీతారామన్‌కు ప్రధాని మోదీ ఆర్థిక శాఖ బాధ్యతలను ఇచ్చినట్టు తెలుస్తోంది. అలా వరసగాబడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం వచ్చింది. రెండో అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన నేతగా రికార్డు సృష్టించారు. తన బ్జడెట్‌లో సంస్కరణలకే నిర్మలా సీతారామన్ ప్రాధాన్యం ఇచ్చారు. సూట్ కేసులా కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే సంప్రదాయానికి నిర్మలా సీతారామన్ శ్రీకారం చుట్టారు.ఓట్ ఆన్ అకౌంట్ బ్జడెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని 50 శాతం పెంచే అవకాశం ఉంది. కిసాన్ సన్మాన్ పథకం ద్వారా భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేల పంట సాయాని మూడు విడతలుగా అందిసు న్నారు. ఇప్పుడు దానిని రూ.9 వేలకు పెంచే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వంపై రూ.12 వేల కోట్ల భారం పడనుంది. ప్రస్తుత సమావేశాల్లో 19 బిల్లులు ఆమోదించే అవకాశం ఉంది. ఇన్‌కమ్ ట్యాక్స్ తదితర విషయాల్లో పాతపద్ధతినే అవలంబించే ఛాన్స్ ఉంది.

# ప్రియాంక కోసం కర్నాటక పట్టు

## ఇక్కడి నుంచి పోటీ చేయించాలనే ఒత్తిడి - తెలంగాణలో సోనియా కోసం ఎదురుచూపు

బెంగళూరు,జనవరి30

త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ప్రియాంక గాంధీ రాష్ట్రం నుంచి పోటీ చేస్తారని గత రెండురోజులుగా చర్చ జరుగుతోంది. ఢిల్లీ నుంచి బెంగళూరు దాకా ఇదే హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే తెలంగాణ నుంచి సోనియాను పోటీ చేయించాలన్న చర్చ సాగుతోంది. లేదా ఆమెను రాజ్యసభకు పంపాలని అనుకుంటున్నారు. కర్నాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడడంతో అగ్రనేతలను తమ రాష్ట్రాల్లో పోటీ చేయించాలన్న పోటీ పెరుగుతోంది. రాహుల్ ఎలాగూ తిరిగి వయనాడ్ నుంచి పోటీ చేస్తారని ప్రకటించారు. ఈ రెండు రాష్ట్రాలకు గాంధీ కుటుంబంతో దశాబ్దాలుగా ప్రత్యేక సంబంధాలు ఉన్నాయి. ఇందిరాగాంధీకి రాజకీయంగా పునర్జన్మ ఇక్కడి నుంచే సాధ్యమైంది. చిక్కమగళూరు నుంచి ఇందిరాగాంధీ విజయం సాధించగా 1999లో సోనియాగాంధీ బళ్లారి నుంచి పోటీ చేసి విజయం నమోదు చేశారు

. మెదక్ నుంచి కూడా ఇందిర పోటీచేసి విజయం సాధించారు. ప్రియాంకగాంధీ పోటీపై రెండు వారాలలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఈ క్రమంలో ప్రియాంక, సోనియాల కోసం ఈ రెండు రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ప్రియాంకగాంధీని కర్నాటక రాష్ట్రం నుంచి పోటీ చేయించడం ద్వారా ఎక్కువ స్థానాల్లో విజయం సాధించవచ్చునని రాష్ట్ర పార్టీ నేతలు ఆలోచనగా ఉన్నట్లు సమాచారం. అందుకే సురక్షితమైన నియోజకవర్గాన్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర నేతలకు సమాచారం లేకుండానే ఢిల్లీ ముఖ్యుల పర్యవేక్షణలోని బృందాలు కొప్పళ నియోజకవర్గంలో సర్వే జరిపినట్లు తెలిసింది. ప్రియాంకగాంధీని తెలంగాణ నుంచి కూడా పోటీ చేయించాలనే డిమాండ్ ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం,

పైగా ఎన్నికలకు ముందు ప్రకటించిన ఐదు గ్యారెంటీలు అమలుచేస్తుండటంతో లోక్‌సభ ఎన్నికలలోను గెలుపు సునాయాసమని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. కొప్పళ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా ఆరుచోట్ల కాంగ్రెస్ విజయం సాధించగా ఒక స్థానంలో గాలి జనార్దనరెడ్డి మరోస్థానంలో బీజేపీ విజయం సాధించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎక్కువ ఉన్నందున విజయం సాధ్యమనే అంచనాలతోనే ప్రియాంకగాంధీని ఆహ్వానిస్తున్నట్లు సమాచారం.

## నేటినుంచి పార్లమెంట్ సమావేశాలు

సభ సజావుగా సాగాలని కోరుకుంటున్న ప్రభుత్వం



న్యూఢిల్లీ,జనవరి30 ఓన్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కోసం ఈ నెల 31వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత లోక్ సభకు ఇవే చివరి సమావేశాలు. ఏప్రిల్– మే నెలలో సార్వత్రిక ఎన్నికల జరిగి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి బడ్జెట్ ప్రతిపాదిస్తారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సెషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ఉదయం 11.30 గంటలకు సమావేశానికి హాజరుకావాలని లోక్ సభలో ప్రాతినిధ్యం వహిస్తోన్న అన్ని పార్టీల నేతలకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సమాచారం ఇచ్చింది. చివరి బడ్జెట్ సెషన్ కావడంతో పార్లమెంట్ సమావేశాలు మంచి వాతావరణంలో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కీలక బిల్లులు గత సమావేశాల్లో ఆమోదం పొందాయి. ప్రస్తుత సమావేశాల్లో ఓన్ ఆన్ అకౌంట్ బడ్జెట్ తోపాటు 19 బిల్లులు ఆమోదించుకోవాలని భావిస్తోంది. భద్రతా ఏర్పాట్ల గురించి అన్ని పార్టీలకు కేంద్ర ప్రభుత్వం వివరించనుంది. సభా సజావుగా జరిగేలా సహకరించాలని ప్రతిపక్షాలను కేంద్ర ప్రభుత్వం కోరనుంది.

## విజయవాడ నుంచి వచ్చి డ్రగ్స్ కేసులో దొరికిన లావణ్య

జల్సాలకు అలవాటు పడడమే కారణమని సమాచారం

విజయవాడ,జనవరి30 టాలీవుడ్‌ని పట్టి పీడిస్తున్న 'డ్రగ్స్ దందా'ను నిర్మూలించాలని అధికారులు సాయశక్తులా ప్రయత్నిస్తున్నా.. చాపకింద నీరులా ఈ డ్రగ్స్ దందా కొనసాగుతూనే ఉంది. సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తుల్లో కొందరు ఈ దందాని అత్యంత రహస్యంగా నడుపుతున్నారని ఇదివరకే కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. అందుకే.. అధికారులు ఇండస్ట్రీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలోనే.. నార్సింగిలో ఇద్దరు నిందితులను తాజాగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిలో ఒకరు లావణ్య అనే విద్యార్థిని కాగా, మరొకరు ఉనీత్ రెడ్డి. సదరు యువతి లావణ్య.. ఒక హీరో ప్రియురాలు అని తేలింది.రిమాండ్ రిపోర్టులోని అంశాల ఆధారంగా.. విజయవాడ నుంచి ఉన్నత చదువుల కోసం లావణ్య హైదరాబాద్‌కు వచ్చింది. జల్సాలకు అలవాటు పడిపోయి టాలీవుడ్‌లో ఛాన్స్ కోసం లావణ్య ప్రయత్నించింది. మ్యూజిక్ టీచర్‌గా పని చేస్తూ చిన్న సినిమాల్లో కేరెక్టర్ ఆర్టిస్టుగా లావణ్య నటించింది. కొన్ని షార్ట్ ఫిలింస్‌లో హీరోయిన్‌గా సైతం నటించింది. ఆ సమయంలోనే ఆమె జల్సాలకు అలవాటు పడింది. ఒక హీరోతో లవ్ అ÷ర్ కూడా నడుపుతోంది. వరలక్ష్మి టిఫిన్స్ డ్రగ్స్ కేసులో అనుమానితురాలుగా ఉన్న లావణ్య .. గత కొంత కాలంగా ఉనిత్ ద్వారా డ్రగ్స్ తెప్పించుకుంటున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. చిత్ర పరిశ్రమలో పలువురికి డ్రగ్స్ సరఫరా చేసినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లావణ్య సోషల్ మీడియా అకౌంట్‌లతో పాటు వ్యక్తిగత చాట్‌ని సైతం పోలీసులు పరిశీలించనున్నారు. చాలామంది వీఐపీలతో పరిచయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. లావణ్యను కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

## ధర్నాలో విద్యార్థిని ఈడ్చుకెళ్లిన కానిస్టేబుల్

హైదరాబాద్,జనవరి30 : హైకోర్టుకు వ్యవసాయ వర్సిటీ భూముల అప్పగింతపై నిరసన చేపట్టిన ఓ ఏబీవీపీ కార్యకర్తను జుట్టుపట్టి ఈడ్చుకెళ్లిన ఘటనలో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. ఘటనకు బాధ్యురాలైన మహిళాకానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ భూములు హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 55 జారీ జీవోను వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నాయి. ఇందులోభాగంగా ఈ నెల 24న ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

బుధవారం
31 జనవరి 2024
జర్నలిస్ట్ వార్త
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...
RNI NO :Title-Code :-TELTEL02102



# వరుస సినిమాలతో బిజీగా అనుపమ

కేరళ కుట్టి అనుపమ పరమేశ్వరన్?కు తెలుగులో ఉన్న ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటుంది. త్వరలోనే టిల్లు స్క్వేర్ సినిమాతో రాబోతుంది ఈ బ్యూటీ. తెలుగు, తమిళ్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటుంది అనుపమ. ఉంగరాల కురులతో.

. కలువ కళ్లతో యూత్‌ను కట్టిపడేస్తుంది. అటు సినిమాలు చేస్తూనే.. ఇటు సోషల్ మీడియాలో యాక్టివ్?గా ఉంటూ ఎప్పటికప్పుడు లేటేస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన నెట్టింట తెగ

వైరలవుతున్నాయి. అటు సినిమాలు చేస్తూనే.. ఇటు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు లేటేస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన నెట్టింట తెగ వైరలవుతున్నాయి. పట్టు చీరలో..

జడలో మ్లలెపూలు.. మెడలో తాళి చూపిస్తూ కొన్ని ఫోటోస్ షేర్ చేసింది ఈ కేరళ కుట్టి. దీంతో అనుపమ ఫోటోస్ పై ఫన్నీగా కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్.

## తిరుపతిలో సందడి చేసిన ధనుష్, నాగార్జున..



నాగార్జున ధనుష్ తో కలిసి నటిస్తున్నారు. టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ధనుష్ తో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ షూటింగ్ తిరుపతిలో జరుగుతోంది. తిరుపతిలోని కపిల తీర్థం నంది సర్కిల్‌లో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో సీన్స్ ను తెరకెక్కిస్తున్నారు. నాగార్జున ఇటీవలే నాసామిరంగ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. సంక్రాంతికానుకగా వచ్చిన ఈ సినిమా మంచి కలెక్షన్స్ ను సాధించింది. ఇక ఇప్పుడు నాగార్జున ధనుష్ తో కలిసి నటిస్తున్నారు.



# దేవర విడుదలలో మళ్లీ అనుమానాలు

పలు చిత్రాల విషయంలో ఇవే సందేహాలు ఈ మధ్యకాలంలో తెలుగు సినీ పరిశ్రమలో సినిమాల రిలీజ్ డేట్స్‌పై పెద్ద చర్చలే జరుగుతున్నాయి. సినిమాల మధ్య ఎక్కువగా క్లాష్ రాకూడదని, అన్ని సినిమాలకు సమానంగా లాభాలు వచ్చేలా చూడాలని నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు చర్చించుకొని మూవీస్ రిలీజ్ డేట్స్‌ను అనౌన్స్ చేస్తూ ఎవరికీ నష్టం జరగకుండా చూస్తున్నారు. సంక్రాంతి సినిమా విడుదలల సమయంలో కూడా అదే జరిగింది. అప్పుడు చాలా చిత్రాలు సంక్రాంతికే విడుదల అవ్వాలని నిర్ణయించుకోగా.. దిల్ రాజు సమక్షంలో మీటింగ్ పెట్టి 'ఈగల్' వెనక్కి తప్పుకుంటున్నట్టు తెలిపారు. కొరటాల శివ, ఎన్‌టీఆర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'దేవర' భారీ స్థాయిలో చిత్రీకరణ జరుపుకుంటోంది. అందుకే ఏ పోటీ లేకుండా ఈ మూవీని ఏప్రిల్ 5న విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించుకున్నారు. ఈ మూవీని సోలో రిలీజ్ చేయడానికి సూర్య హీరోగా నటిస్తున్న 'కంగువ'ను సైతం వెనక్కి తప్పించారు. కానీ ఇంతలోనే ఫ్యాన్స్‌కు ఊహించని ట్విస్ట్ ఇచ్చారు 'దేవర' మేకర్స్. ఈ సినిమా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్సులు ఉన్నాయని టాలీవుడ్‌లో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇక తాజాగా ఇదే విషయంపై దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. అంతే కాకుండా తను నిర్మిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' రిలీజ్ డేట్ గురించి కీలక అప్డేట్‌ను అందించారు. అయితే 'దేవర' పోస్ట్‌పోన్ అయినట్టేనా అని అడగగా.. ఒకవేళ పోస్ట్‌పోన్ అయితే మేము వస్తామని చెప్తున్నామంటూ 'ఫ్యామిలీ స్టార్' గురించి స్పష్టం చేశారు. ప్రస్తుతం దిల్ రాజు నిర్మిస్తున్న పలు చిత్రాల్లో విజయ్ దేవరకొండ, పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఫ్యామిలీ స్టార్' కూడా ఒకటి. ఈ మూవీ సంక్రాంతికే విడుదల కావాల్సి ఉన్నా.. పోటీ ఎక్కువగా ఉండడంతో సమ్మర్‌కు పోస్ట్‌పోన్ అయ్యింది. ఈగల్' సోలో రిలీజ్ అవుతుందని అప్పట్లో ఆ మూవీ నిర్మాతలకు మాటిచ్చారు దిల్ రాజు. కానీ ఇప్పుడు దానికి పోటీగా 'ఊరి పేరు భైరవకోన' వస్తున్నట్టు ప్రకటించింది. అదే విషయంపై మాట్లాడుతూ.. 'ఊరి పేరు భైరవకోన' పోస్ట్‌పోన్ చేయడానికి నిర్మాతలు ఒప్పుకున్నారని దిల్ రాజు ప్రకటించారు. ఫిబ్రవరి 9న నాలుగు సినిమాలు ఉన్నాయి. 16న ఫ్రీగా ఉంది అని రాజేశ్, అనిల్‌కు నేనే చెప్పాను.

# శరవేగంగా పుష్ప చిత్రీకరణ

### వాయిదా వార్తలను తోసిపుచ్చిన చిత్రబృందం

పుష్ప చిత్రం దేశవ్యాప్తంగా ఎంత సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా పుష్ప-2 సినిమా తెరకెక్కుతోంది. తొలి భాగం సాధించిన విజయంతో సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మేకర్స్, ముఖ్యంగా సుకుమార్ ఈ చిత్రాన్ని పార్ట్1ను మించేలా జాగ్రత్తగా తెరకెక్కిస్తున్నాడు. అదీ కాక ఈ చిత్రానికి అల్లు అర్జున్ కు ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారం దక్కడంతో ఎంతో బాధ్యతతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రష్మిక మందన్నా కథానాయికగా, పాహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోండగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించగా ఓ రెండు మూడ్రోజుల నుంచి పుష్ప-2 విడుదల వాయిదా అంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై బన్నీ డిజిటల్ టీమ్ వివరణ కూడా ఇచ్చింది. అనుకున్న సమయానికే పుష్పరాజ్ ర్యాంపేజ్ ఖాయం అంటూ ట్వీట్ సైతం చేశారు.






# బూట్ కట్ బాలరాజుగా సోహైల్

బిగ్ బాస్ రియాలిటీ షోతో గుర్తింపు తెచ్చుకున్న సయ్యద్ సోహైల్, 'బూట్ కట్ బాలరాజు' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకు రాబోతున్నారు. కోనేటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదలకు రెడీ అవుతోంది. ఇప్పటికే ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్లు, టీజర్, ప్రమోషనల్ వీడియోలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. సినిమాపై భారీగా అంచనాలు పెంచాయి. తాజాగా 'బూట్ కట్ బాలరాజు' ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ వేడుకలో కామెడీ బ్రహ్మ బ్రహ్మానందం, మంచు మనోజ్, సందీప్ కిషన్, సాయి రాజేష్, లక్ష్మీ భూపాల్ సహా పలువరు సినీ సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సోహైల్ తన సినిమా గురించి కీలక విషయాలు వెల్లడించాడు. అందరూ తమ సినిమా చూడాలంటూ ఎమోషనల్ అయ్యాడు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పాడు. 'మా నాన్న రిటైర్మెంట్ డబ్బులు, నేను సంపాదించిన డబ్బులు, ఇల్లు కొనేందుకు దాచుకున్న డబ్బులు ఈ సినిమా కోసం పెట్టాను. ఈ సినిమా కోసం మా సర్వస్వం ధారపోశాం. సినిమా కోసం అందరిలాగే కష్టపడ్డాం. కొన్ని సార్లు ఏడ్చాం కూడా. నన్ను నేను నిరూపించుకోవాలి అనే కసి ఏర్పడింది' అని సోహైల్ అన్నారు. ఇక తన సినిమా గురించి పెద్ద ఎత్తున ప్రమోషన్ చేయడానికి డబ్బులు లేవని చెప్పిన సోహైల్, ప్రతి ఒక్కరు థియేటర్ కు వెళ్లి చూడాలని కోరారు. స్టేజి మీద మోకాళ్ల మీద కూర్చొని అందరికీ విజ్ఞప్తి చేశారు. 'నా సినిమాను థియేటర్ కు వెళ్లి చూడండి. సినిమా గురించి ఇంత కంటే ఎక్కువ పబ్లిసిటీ చేసుకునేందుకు డబ్బులు లేవు.

ఫిబ్రవరి 2న 'బూట్ కట్ బాలరాజు' సినిమా థియేటర్లలోకి వస్తుంది. మీరంతా చూసి ఆశీర్వదించండి' అంటూ కంటతడి పెట్టుకున్నారు సోహైల్. 'బూట్ కట్ బాలరాజు' సినిమాలో సోహైల్ సరసన మేఘ లేఖ హీరోయిన్ గా నటించింది. ఎండీ పాషా ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో సీనియర్ నటి ఇంద్రజ, సునీల్, సిరి హన్మంతు, జబర్దస్త్ రోహిణి, ముక్కు అవినాష్, సద్దాం కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.







మృణాల్ ఠాకుర్ స్పైసీ లుక్.. రాగమంజరిలా జాన్వీ కపూర్
బ్లాక్ అండ్ వైట్ ఫొటోల్లో పిచ్చెక్కిస్తున్న శ్రీలీల
ఫ్యామిలీతో ఉన్న క్యూట్ వీడియో షేర్ చేసిన అనసూయ

పరువాల విందు చేస్తున్న హాట్ బ్యూటీ దివ్యభారతి
గుర్తుపట్టలేనంతగా మారిపోయిన 'కొత్త బంగారు లోకం' బ్యూటీ
హాట్‌నెస్‌తో కాక రేపుతున్న హీరోయిన్ మృణాల్ ఠాకుర్

రాజమండ్రి రాగమంజరిలా ధగధగా మెరిసిపోతున్న జాన్వీ కపూర్
ఎద ఒంపుసొంపులతో గందరగోళం చేసేస్తున్న
రాశీఖన్నాటైట్ ఫిట్ డ్రస్‌లో కేక పుట్టిస్తున్న
హీరోయిన్ సోనాల్ చౌహాన్